
బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణ చేస్తున్న అర్చకులు

ఖాద్రీశుడి కల్యాణం..
జగమంత వైభోగం..


మాంగల్యధారణ ఘట్టం

శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు వధువులై, మహావిష్ణువైన ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి వరుడై పెళ్లి పీటలపై కొలువుదీరగా.. చూసిన భక్తజనం పులకించిపోయారు. దేవేరులతో దేవదేవుడి కల్యాణోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా సాగింది. వేలాదిగా భక్తులు హాజరై, స్వామివారి వైభోగాన్ని కనులారా వీక్షించి, తరించారు. ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణ ఘట్టం కనులపండువగా సాగింది. కల్యాణమంటపంలో మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ మాంగల్య ధారణ ఘట్టాన్నివైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు చదివింపులు చదివించి, భక్తులు బంధువులైపోయారు. నారసింహుడి బ్రహ్మోత్సవాల ప్రారంభానికి సూచికగా అంతకుముందు ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురువారం స్వామివారు హంస వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. - కదిరి

272 ఓట్లు తగ్గాయ్..



జిల్లాలో తగ్గిన ఓటర్ల సంఖ్య

అదనంగా 10 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాల గుర్తింపునకు కసరత్తు

ధర్మవరం, మార్చి 20: జిల్లాలో ఓటర్ల సంఖ్య స్వల్పంగా తగ్గింది. ఫారం-7 దరఖాస్తులతో ఓట్లు తగ్గిపోయాయి. ఈ ఏడాది జనవరి 12 నాటికి జిల్లాలో ఓటర్ల సంఖ్య 13,91,628 అని తేలింది. ఈనెల 16 నాటికి ఆ సంఖ్య 13,91,356కి తగ్గింది. దీంతో 272 ఓట్లు తగ్గాయి. ఫారం-7 ద్వారా మృతిచెందిన, వలస వెళ్లినవారి ఓట్లను తొలగించడమే ఇందుకు కారణమని ఎన్నికల అధికారులు చెబుతున్నారు. మళ్లీ ఓటు నమోదుకు కేంద్రం ఏప్రిల్ 25వ తేదీ వరకు అవకాశం కల్పించింది. దీంతో ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు.

పెరిగిన పోలింగ్ కేంద్రాలు

జిల్లావ్యాప్తంగా గతంలో 1561 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. తాజాగా మరో పది కేంద్రాలను పెంచారు. దీంతో వీటి సంఖ్య 1571కి చేరింది. ఓటర్ల సౌకర్యార్థం అధికారుల సూచన మేరకు ఎన్నికల అధికారులు పది పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. ఇందులో మడకశిర నియోజకవర్గంలో 117-ఏ పి పాళ్యం, 123-ఏ రత్నగిరి, 134-ఏ ఆలూడి, 153-ఏ అగళి, పుట్టపర్తి నియోజకవర్గంలో 91-ఏ పుట్టపర్తిటౌన్ 102-ఏ జిల్లా కేంద్రంలోని ఎనుములపల్లి, 107-ఏ ప్రశాంతి గ్రామం, ధర్మవరం నియోజకవర్గంలో 30-ఏ ఎం.అగ్రహారం, 37-ఏ ఉప్పలపాడు, 168-ఏ ధర్మవరంలోని మార్కెట్‌యార్డు ప్రాంతంలో అదనంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

అత్యంత సమస్యాత్మక కేంద్రాలపై కసరత్తు

జిల్లాలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించే కసరత్తు సాగుతోంది. దీనిపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో వివాదాలు, గొడవలు తలెత్తిన కేంద్రాలను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. వాటిని గుర్తించి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేయాలని సమాలోచనలు చేస్తున్నారు.

శ్రీవారికి పట్టువస్త్రాలు

శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం సందర్భంగా ప్రభుత్వం నుంచి ఆనవాయితీగా శ్రీవారికి బుధవారం జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు పట్టు వస్త్రాలు సమర్పించారు. కలెక్టర్‌కు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి, స్వామివారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వంశీకృష్ణ, తహసీల్దార్ పుల్లారెడ్డి పాల్గొన్నారు. - కదిరి


ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కలెక్టర్

ఏజెంటుగా కూర్చున్నా.. ఇంటి పట్టా కూడా ఇవ్వలే..

ఎమ్మెల్యే దుద్దుకుంటను నిలదీసిన వైసీపీ కార్యకర్త

కొత్తచెరువు, మార్చి 20: 'వైసీపీ కోసం పని చేశా. 2019 సార్వత్రిక ఎన్నికల్లో మీ తరపున పోలింగ్ ఏజెంటుగా కూర్చున్నా. మీరు ఎమ్మెల్యే అయ్యాక కనీసం ఇంటి పట్టా కూడా ఇవ్వలేదు' అంటూ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని కొత్తచెరువులో బుధవారం ఆ పార్టీ కార్యకర్త నిలదీశాడు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే.. మండల కేంద్రం పరిధి పెనుకొండ రహదారిలోని బీసీ కాలనీలో పర్యటించారు. చాలామంది కార్యకర్తలు తమకు వాటిల్లిన అన్యాయాన్ని ఎమ్మెల్యే ఎదుట ఏకరవు పెట్టారు. వైసీపీ కార్యకర్త చీమల రఘు మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడి పనిచేశాననీ, తనకు కనీసం ఇంటి స్థలం కూడా లేదన్నాడు. పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ఇంటి పట్టా ఇవ్వలేదనీ, పార్టీ కోసం పనిచేసేవారికి ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ ప్రశ్నించాడు. పార్టీకి పనిచేయని వారికి రెండు, మూడు పట్టాలు ఇచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. రానున్న ఎన్నికల్లో వారితోనే ఓటు వేయించుకోవాలంటూ ఎమ్మెల్యేకి స్పష్టం చేశాడు. దీంతో ఎమ్మెల్యే సర్ది చెప్పే ప్రయత్నం చేశాడు. వైసీపీ అధికారంలోకి వస్తే తప్పకుండా ఇంటి పట్టా ఇస్తానంటూ చెప్పుకొచ్చాడు.


ఎమ్మెల్యే దుద్దుకుంటను ప్రశ్నిస్తున్న వైసీపీ కార్యకర్త రఘు

సబ్ రిజిస్ట్రార్, రైటర్‌కు 13 రోజుల రిమాండ్

మడకశిరటౌన్, మార్చి 20: అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దాడుల్లో పట్టుబడిన మడకశిర సబ్‌రిజిస్ట్రార్ దామోదరం, రైటర్ సమీవుల్లాకు కోర్టు 13 రోజుల రిమాండ్ విధించింది. మడకశిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఓ రైతు నుంచి రూ.2.50 లక్షలు లంచం తీసుకుంటుండగా సబ్‌రిజిస్ట్రార్, రైటర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 11.30 గంటల వరకు సోదాలు నిర్వహించారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్, రైటర్‌ను కర్నూలు తరలించారు. ఏసీబీ కోర్టులో బుధవారం సాయంత్రం హాజరుపర్చగా న్యాయమూర్తి 13 రోజులపాటు రిమాండ్ విధించినట్లు సిబ్బంది ద్వారా తెలిసింది. పట్టణంలో మరికొన్ని శాఖల కార్యాలయాలపై కూడా దాడులు కొనసాగే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. దీంతో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిలో ఆందోళన నెలకొంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.34 గురువారం (సాయంత్రం)	5.01 శుక్రవారం (ఉదయం)
కదిరి	6.31 గురువారం (సాయంత్రం)	5.08 శుక్రవారం (ఉదయం)
ధర్మవరం	6.36 గురువారం (సాయంత్రం)	5.05 శుక్రవారం (ఉదయం)
హిందూపురం	6.34 గురువారం (సాయంత్రం)	5.09 శుక్రవారం (ఉదయం)
పెనుకొండ	6.32 గురువారం (సాయంత్రం)	5.06 శుక్రవారం (ఉదయం)

ఉష్ణోగ్రతలు (మంగళ)

	గరిష్ఠం	కనిష్ఠం
పుట్టపర్తి	38.0	24.0
కదిరి	37.0	24.0
ధర్మవరం	38.0	24.0
హిందూపురం	36.0	23.0
పెనుకొండ	37.0	23.0

కోడ్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోండి

ఫీల్డ్ అసిస్టెంట్, వలంటీర్లపై ఆర్డీఓకు టీడీపీ ఫిర్యాదు


ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

పుట్టపర్తి రూరల్, మార్చి 20: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ వైసీపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేస్తున్న వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు బుధవారం ఆర్డీఓ భాగ్యరేఖకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆమెను కలిశారు. టీడీపీ పుట్టపర్తి అర్బన్ కన్వీనర్ రామాంజనేయులు మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం తీసుకుంటూ వైసీపీ అభ్యర్థికి మద్దతుగా ఓడీసీ మండలం టీ కుంటపల్లిలో ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ, వలంటీర్లు నరసింహులు, కొమ్ము ఆదెప్ప, వై సుబ్బారావు ప్రచారం చేశారన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను కోరారు. కార్యక్రమంలో పుడా మాజీ చైర్మన్ సుధాకర్ నాయుడు, మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్సు రమేష్, తెలుగు యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మనోహర్, ఉపాధ్యక్షుడు వైవీ మురళి పాల్గొన్నారు.

మూడోరోజు 594 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 20: జిల్లావ్యాప్తంగా బుధవారం నిర్వహించిన పదో తరగతి ఆంగ్లపరీక్షకు 594 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. మొత్తం 22,546 మంది విద్యార్థులకుగాను 594 మంది గైర్హాజరయ్యారన్నారు. దీంతో 21,952 మంది పరీక్షలు రాశారనీ, 97.39 శాతం హాజరు నమోదైందని డీఈఓ వెల్లడించారు.

వైసీపీలో ఎవరి దారి వారిదే..

ఆరని అసమ్మతి..!



హిందూపురం, మార్చి 20: నియోజకవర్గ వైసీపీలో నాయకుల పరిస్థితి కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలింతకు పాల్పడుతున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మొన్నటి వరకు నియోజకవర్గంలో అధికార పార్టీలో నాలుగు గ్రూపులు ఉండేవి. ఒక నాయకుడిని చూస్తే మరో నాయకుడికి గిట్టని పరిస్థితి. పరోక్షంగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునేవారు. ఉన్నట్లుండి నాయకులు ఏకతాటిపైకి వచ్చారు. మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేవారు. ఆ వెనువెంటనే బుధవారం నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇందులో నాలుగువర్గాల నేతలు పాల్గొన్నారు. ఒకే వేదికపై నుంచి మాట్లాడుతూ.. పార్టీలో అనైక్యత వల్లే పురంలో టీడీపీ గెలుస్తోందనీ, ఈసారి కంచుకోటను బద్దలు కొడదామంటూ పాతపాట అందుకున్నారు. కొంత మంది నాయకులు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీకి బీసీ వర్గం బలంగా ఉందనీ, వారుఉన్నంతకాలం వైసీపీ గెలవడం కష్టమనీ, ఎలాగైనా వారిని లాక్కోవాలని చెప్పడం విశేషం. వచ్చేనెల 1వ తేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హిందూపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఇందుకోసమే అందరూ ఏకమై, ఒకే వేదికపైకి వచ్చినట్లు సమాచారం. వారు వేదికపై నుంచి కార్యకర్తలకు తామంతా ఒక్కటయ్యామని చెబుతున్నా అనుచరులు మాత్రం నమ్మడం లేదు. ఎందుకంటే 20 ఏళ్లుగా చెబుతున్న మాటలు ఇవే. ఇందులో కొసమెరుపు ఏమిటంటే కాంగ్రెస్ పార్టీలో ఉన్నవారంతా వైసీపీలోకి వచ్చారు. అప్పుడూ వారే.. ఇప్పుడూ వారే. దీంతో నాయకులు చెబుతున్న మాటలు అనుచర వర్గం నమ్మలేకపోతోందని కొంతమంది పార్టీ వర్గీయులు బహిరంగంగా చెప్పుకుంటున్నారు.

పురంలో కలయిక డ్రామా..?

- సీఎం వస్తున్నారని ఒకే వేదికపైకి నేతలు
- ఏమాత్రం నమ్మే స్థితిలోలేని శ్రేణులు
- కత్తులు పెట్టుకుని.. కౌగిలింతలా?



కలవని మనసులు?

నిన్నమొన్నటి వరకు ఆ వేదికపై ఉన్న నాయకులు ఒకరిపై ఒకరు పరోక్షంగా, ప్రత్యక్షంగా దుమ్మెత్తి పోసుకున్నారు. ఎన్నికల సమయంలో సరికొత్త దృశ్యం ఆవిష్కృతమైనా నిన్నమొన్నటి వరకు ఒక నాయకుడిపై మరొకరు అధిష్టానానికి ఫిర్యాదులు చేసుకున్న ఘటనలు వారి కళ్లముందే కదలాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మనుషులు కలిశారు తప్ప.. మనసులు కలవలేదన్న అభిప్రాయం అనుచరవర్గంలో వ్యక్తమవుతోంది. ఎన్నికలకు కొన్నిరోజుల ముందు పార్టీ అధ్యక్షుడిగా మాజీ ఐపీఎస్ అధికారి షేక్ మహ్మద్ ఇక్బాల్ వచ్చారు. ఆయన వచ్చినప్పటి నుంచి ప్రస్తుత ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ వ్యతిరేకిస్తూ వచ్చారు. ఒకానొకదశలో ఎమ్మెల్సీని ఇక్కడి నుంచి సాగనంపాలని రోడ్డెక్కి ధర్నాలు చేశారు. పెద్దఎత్తున నిరసనలు తెలిపారు. ఆ తరువాత మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, హత్యకు గురైన చౌళూరు రామకృష్ణారెడ్డి కూడా ఎమ్మెల్సీని వ్యతిరేకించారు. రామకృష్ణారెడ్డి సోదరి మధుమతి రెడ్డి కూడా ఎమ్మెల్సీని వ్యతిరేకించారు. ఆరు నెలల క్రితం ఆయనను ఇక్కడి నుంచి పంపించేశారు. ఆ స్థానంలో ప్రస్తుత సమన్వయకర్త దీపిక వచ్చారు. అప్పటి వరకు దీపిక ఎవరన్నది తెలియదు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండతో ఆమెకు సమన్వయకర్త పదవి వరించిందన్నది బహిరంగ రహస్యమే. ఆమె వచ్చినప్పటి నుంచి నవీన్, వేణుగోపాల్ రెడ్డి, మధుమతి వర్గాలు వ్యతిరేకిస్తూ వచ్చాయి. పార్టీకోసం కష్టపడి నష్టపోయిన తమకు సమన్వయకర్త పదవి ఇవ్వకుండా ఎక్కడో బెంగళూరులో ఉన్నవారికి ఇచ్చారని వారంతా అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. ఈ ఆరు నెలల కాలంలో దీపిక వర్గాన్ని టార్గెట్ చేస్తూ పరోక్షంగా విమర్శలు కూడా చేశారు. నవీన్‌నిశ్చల్, మధుమతిరెడ్డి మొన్నటి వరకు ఎమ్మెల్యే టిక్కెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. అదికాదని తెలిశాక జిల్లా అధ్యక్ష పదవి కోసం నవీన్, మధుమతి రెడ్డి పోటీపడ్డారు. ఈ పదవికోసం పెద్దిరెడ్డిని పలుసార్లు ఆశ్రయించినట్లు సమాచారం. ఉన్నట్లుండి వారం రోజుల క్రితం నవీన్‌నిశ్చల్‌కు జిల్లా అధ్యక్ష పదవిని కట్టబెట్టారు. మధుమతి రెడ్డి అప్పటి నుంచి మరింత గుర్రుగా ఉన్నారు. అయినా బయటకు పొక్కలేక ఆవేదనను అనుచర వర్గం వద్ద వ్యక్తం చేసినట్లు సమాచారం. తన తమ్ముడిని పోగొట్టుకున్నా తనకు అధిష్టానం ఏం న్యాయం చేసిందని ఆమెతోపాటు రామక్రిష్ణారెడ్డి వర్గీయులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి సందర్భంలో ఉన్నట్లుండి విలేకరుల సమావేశంలో నాలుగువర్గాల నాయకులు కలవడం, ఆ తరువాత బుధవారం కార్యకర్తల సమావేశంలో వారి పరిస్థితి చూస్తే మనుషులు కలిశారు కానీ మనసులు కలవలేదన్నది నగ్నసత్యమని ఆయా నాయకుల అనుచర వర్గం చర్చించుకోవడం కనిపించింది.

సమావేశానికి ఇరువర్గాల అనుచరులు దూరం

పురంలోని ఆర్ఎంఎస్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన వైసీపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి నలుగురు నేతలు హాజరయ్యారు. ఇద్దరు నేతల అనుచరవర్గం డుమ్మా కొట్టినట్లు తెలిసింది. ఎందుకంటే ఒకవర్గం తమకు పార్టీలో న్యాయం జరగలేదనీ, అలాంటపుడు ఎందుకు రావాలని భావించి పాల్గొనలేదని సమాచారం. మరోవర్గం అనుచరులు మాత్రం తమకు ఎలాంటి ప్రాధాన్యత లేదనీ, సమావేశానికి ఎందుకు వెళ్లాలని తీర్మానించినట్లు తెలిసింది. ఒకవర్గం ముందుగానే పసిగట్టి కొంతమందికి పల్లెల్లో నగదు ఇచ్చి కార్యకర్తలను తీసుకొచ్చినట్లు సమాచారం.

పురం వైసీపీలో సరికొత్త డ్రామా?

కొన్నిరోజుల క్రితం పదవి పొందిన నాయకుడు నియోజకవర్గంలో అంతా ఏకతాటిపై ఉన్నట్లు చూపించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. వచ్చేనెల 1న ముఖ్యమంత్రి జగన్ హిందూపురం రానున్న నేపథ్యంలో తాను పదవి చేపట్టాక అందరు నాయకులను ఏకం చేశానని చెప్పుకోవడానికి తతంగం సాగిస్తున్నట్లు ఆ పార్టీలోని ఓ వర్గం నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రతి ఎన్నికల్లో కొంత మంది నాయకులు ఇలాంటి కొత్త డ్రామాలకు తెరలేపడం సహజమనీ, అది నియోజవర్గ ప్రజలకు తెలుసన్న చర్చలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు కూడా అదే జరుగుతోందనీ, ఎప్పుడో ఈ నియోజకవర్గంలో వర్గ విభేదాలున్నాయని క్షేత్రస్థాయికి వెళ్లింది. వేదికపై నాయకులు కలిసిన వెంటనే ఓట్లు రాలవని రాజకీయ విశ్లేషకులతోపాటు అధికార పార్టీలోని ఓవర్గం నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఏది ఏమైనా ఈసారి అధికార పార్టీలో సరికొత్త డ్రామాకు తెరలేపారనీ, కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకున్నారన్న వాదన హిందూపురం వైసీపీలో వినిపిస్తోంది.


ఒకే వేదికపై వైసీపీ పురం నియోజకవర్గ నేతలు



కదిరిలో కలిసేదే లే..

మెట్టు దిగని ఎమ్మెల్యే

మరో మంత్రి రాయబారం

ఫలితం శూన్యం

కదిరి: వైసీపీలో బుజ్జగింపుల పర్వం కొనసాగుతోంది. కదరి నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి మగ్బూల్ అహ్మద్, ఎమ్మెల్యే సిద్దారెడ్డి మధ్య దూరం పెరుగుతోంది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాయబారం ఫలించలేదు. తాజాగా రాయచోటి వైసీపీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి రంగంలోకి దిగినట్లు సమాచారం. ఆయన మంగళవారం ఎమ్మెల్యే సిద్దారెడ్డితో సాగించిన చర్చలు ఎటువంటి పురోగతి లేకుండానే ముగిసినట్లు తెలిసింది. ఎమ్మెల్యే సిద్దారెడ్డి మెట్టు దిగలేదని సమాచారం. ఆయనతో ఉన్న క్యాడర్ కూడా ఇదే ధోరణి ప్రదర్శించినట్లు తెలిసింది. దీంతో ద్వితీయశ్రేణి నాయకత్వం అయోమయంలో పడింది. ఇరువర్గాల మధ్య వైసీపీ క్యాడర్ నిస్తేజంగా మారినట్లు తెలుస్తోంది. మండలస్థాయి ప్రజాప్రతినిధులు.. ఎమ్మెల్యే అభ్యర్థితో కలిసి రాలేదన్న కారణంతో ఎక్కువ మంది కార్యకర్తలు నిరుత్సాహంగా ఉన్నట్లు తెలిసింది. దీంతో ప్రచారం కూడా మందకొడిగా సాగుతున్నట్లు సమాచారం. మండలాలకు ప్రచారానికి వెళ్తే క్యాడర్ కలిసి రాకపోవడంతో కదిరి నుంచి కార్యకర్తలను తరలించే పరిస్థితి ఉన్నట్లు వైసీపీ నాయకులే చెబుతున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి మధ్య దూరం పార్టీ గెలుపుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని కార్యకర్తలు చెబుతున్నారు.

మెట్టు దిగని ఎమ్మెల్యే

ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఉండగానే నియోజకవర్గ ఇన్‌చార్జిగా మగ్బూల్‌ను వైసీపీ అధిష్టానం ప్రకటించింది. దీంతో అసమ్మతి రాజుకుంది. అది పెరుగుతూనే వస్తోంది. ఎమ్మెల్యే వర్గీయులంతా సమావేశమై మరీ.. మగ్బూల్‌కు సహకరించేలేదని అధిష్టానానికి స్పష్టం చేశారు. ఆ తరువాత పలుమార్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. పలువురు ద్వితీయశ్రేణి నాయకులతో చర్చించారు. అయినా ఎమ్మెల్యే వర్గంలో ఎక్కువ మంది మగ్బూల్‌తో కలవలేదు. మంత్రి పెద్దిరెడ్డి ఇద్దరినీ కలపడానికి రెండుమార్లు ప్రయత్నించినా ఎమ్మెల్యే అందుబాటులో లేకుండా పోయారు. మూడోసారి మంత్రి పెద్దిరెడ్డి నేరుగా ఎమ్మెల్యేతో చర్చలు సాగించారు. పార్టీకి పనిచేస్తామని ఎమ్మెల్యే చెప్పినట్లు తెలిసింది. ఎమ్మెల్యే అభ్యర్థితో కలిసి వస్తామని చెప్పలేదని సమాచారం. ఆ తరువాత రోజులు గడుస్తున్నా ఇద్దరి మధ్య దూరం మాత్రం తగ్గలేదు. తనతో కలిసి వచ్చిన వారికి కూడా ఎమ్మెల్యే అభ్యర్థి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదనీ, దీంతో వారు కూడా దూరంగా ఉన్నట్లు సమాచారం. రెండురోజుల క్రితం రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి వచ్చి చర్చలు సాగించారు. అయినా ఎమ్మెల్యే మెట్టు దిగలేదని సమాచారం. పార్టీకి కలిసికట్టుగా పనిచేయాలని శ్రీకాంత్‌రెడ్డి సూచించినా, తాను ఇప్పుడు వైసీపీలోనే ఉన్నాననీ, ఆ పార్టీకే పనిచేస్తానని చెప్పినట్లు తెలిసింది. దీంతో వారిద్దరి మధ్య రాజీ కుదరలేదని సమాచారం. ఎమ్మెల్యే అనుచరులు కూడా అదే విషయాన్ని శ్రీకాంత్‌రెడ్డికి గట్టిగా చెప్పినట్లు తెలిసింది.

ద్వితీయశ్రేణిలో గందరగోళం

ఎమ్మెల్యే సిద్దారెడ్డి, అభ్యర్థి మగ్బూల్ మధ్య దూరం కొనసాగుతుండడంతో ద్వితీయశ్రేణి నాయకులు అయోమయంలో ఉన్నట్లు తెలిసింది. గ్రామాల్లో ఉంటున్న ఎమ్మెల్యే వర్గీయులు అభ్యర్థికి ఏమాత్రం సహకరించకపోవడంతో ఈ పక్కనున్న క్యాడర్ కూడా అయోమయంలో ఉన్నట్లు సమాచారం. ఇరువర్గాలు కలిసి రాకపోతే ఓటమి ఖాయమని కార్యకర్తలు బాహాటంగా చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం కార్యకర్తలు నిస్తేజంగా ఉన్నారని చెబుతున్నారు. ప్రచారం కూడా మందకొడిగా సాగుతోందంటున్నారు. కార్యకర్తలను పట్టించుకునేవారే కరువయ్యారని వారు వాపోతున్నారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి, అభ్యర్థి మగ్బూల్ మధ్య దూరం కార్యకర్తలు, నాయకులను రెండు వర్గాలుగా చీల్చిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈదశలో వీరు కలిసేది అనుమానమేనన్న చర్చ పార్టీలో సాగుతోంది.


ఎమ్మెల్యే సిద్దారెడ్డితో చర్చిస్తున్న రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)



ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల



కళాశాలలో తాగునీటి కొళాయిలను ఎత్తుకెళ్లిన దృశ్యం



కళాశాలలో వాష్ రూముల తలుపులను తొలగించిన దుండగులు



బాత్‌రూముల్లో బేసిన్లు, నీటి కొళాయిలను ఎత్తుకెళ్లిన దుండగులు

టీడీపీ వాళ్లు కట్టారని..!

ఐదేళ్లుగా ప్రారంభానికి నోచుకోని భవనాలు



- నూతన భవనాలలో వస్తువుల చోరీ
- విలువైన పరికరాలు చోరీ, ధ్వంసం
- మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వం అన్యాయం

రూ. 10 కోట్ల ప్రజా ధనం వృథా

ముస్లిం మైనార్టీ విద్యార్థుల కోసం కోట్ల రూపాయలతో నిర్మించిన భవనాలు ప్రారంభించక మునుపే పాడై పోతున్నాయి. జిల్లాలో అత్యధికంగా ముస్లింలు ఉండే గుంతకల్లులో ఆయా వర్గాల విద్యార్థుల కోసం గత టీడీపీ ప్రభుత్వం రూ. 10 కోట్లతో విద్యా భవనాలను నిర్మించింది. ప్రారంభించేలోపే ఎన్నికలు రావడం ముస్లిం విద్యార్థులకు శాపంగా మారింది. అధికార మార్పిడి జరగడంతో గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఈ భవనాలను ప్రారంభించకుండా తాత్సారం చేసింది. ఈ భవనాలను ఇతర అవసరాలకు మళ్లించి మైనార్టీ విద్యార్థులకు అన్యాయం చేసింది. - గుంతకల్లు

రూ. పది కోట్లతో నిర్మాణం

మల్టీ సెక్టోరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎంఎస్‌డీపీ) కింద కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్యంలో రూ.10 కోట్లు ఖర్చుచేసి పట్టణంలో గత టీడీపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ఉర్దూ జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ఉర్దూ బాలికల వసతి గృహం, ఉర్దూ బాలుర వసతి గృహ నిర్మాణాలను చేపట్టింది. వాటిలో జూనియర్ కళాశాల, బాలబాలిక వసతి గృహాల నిర్మాణాలను పూర్తి చేసింది. కళాశాల, హాస్టళ్లకు సిబ్బందిని నియమించక మునుపే 2019లో ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ భవనాలను ప్రారంభించడానికి ఎటువంటి చర్యలూ తీసుకోకపోగా, వాటిని ఇతర అవసరాలకు వినియోగించింది. దీంతో మైనార్టీ ఉర్దూ మీడియం విద్యార్థులకు ఉన్నత విద్య దూరమైంది. ఖాళీగా ఉన్న భవనాలను కనీసం పరిరక్షించకపోవడంతో లక్షల విలువైన విద్యుత్, ప్లంబర్ పరికరాలు, తలుపులను దొంగలు ఎత్తుకెళ్లారు.



రూముల్లో సీలింగ్ ఫ్యాన్లను దొంగలు ఎత్తుకెళ్లిన దృశ్యం



ప్రభుత్వ ఉర్దూ బాలికల వసతి గృహ భవనం

మైనార్టీ భవనాలు ఇతరాలకు..

తమది ముస్లిం పక్షపాత ప్రభుత్వమని ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన వైసీపీ ప్రభుత్వం వారిలో విద్యా వికాసం కోసం నిర్మించిన కళాశాల, హాస్టలు భవనాలను ఇతర అవసరాలకు వినియోగించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కసాపురం రహదారికి ఆనుకుని పాత తహసీల్దారు కార్యాలయం వద్ద నిర్మించిన ఉర్దూ బాలుర వసతి గృహాన్ని ఆర్డీవో కార్యాలయానికి వినియోగిస్తున్నారు. గుంతకల్లుకు ఆర్డీవో కార్యాలయాన్ని మంజూరు చేయగా, అందుకోసం కొత్త భవనాన్ని నిర్మించడమో, అద్దె భవనాన్ని లీజుకు తీసుకుని ఏర్పాటు చేయడమో చేయాలి. కానీ అలా చేయకుండా మైనార్టీ ఉర్దూ బాలుర హాస్టలు వృథాగా ఉంది కదా అని రెండేళ్ల కిందట అందులో ఆర్డీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. మైనార్టీలు ఆందోళన చేయగా అతి త్వరలో ఆర్డీవో కార్యాలయాన్ని నిర్మించి ఉర్దూ హాస్టలు భవనాన్ని ఖాళీ చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కానీ అది జరగలేదు. అంతటితో ఆగకుండా అద్దె భవనంలో ఉన్న బీసీ హాస్టలును ఎస్కేపీ జూనియర్ కళాశాల వద్ద నిర్మించిన ఉర్దూ బాలికల వసతి గృహంలోకి మార్పు చేయాలని ప్రతిపాదించారు. దీన్ని టీడీపీ, మైనార్టీలు తీవ్రంగా అభ్యంతరం చెప్పి, అడ్డుకోవడంతో ఆ ప్రయత్నాన్ని విరమించారు.



విద్యుత్ స్విచ్, మెయిన్ బోర్డులను తస్కరించిన దృశ్యం

దొంగల స్వైరవిహారం

మైనార్టీ ఉర్దూ కళాశాల, ఉర్దూ బాలికల వసతి గృహ భవనాలు ఖాళీగా ఉండటంతో వాటిపై దొంగల కన్నుపడింది. లక్షల విలువైన విద్యుత్, ప్లంబరు పరికరాలు, తలుపులను దుండగులు పీకేశారు. తరగతి గదులు, వసతి గదుల్లో పైకప్పునకు బిగించిన సీలింగ్ ఫ్యాన్లన్నింటికీ ఎత్తుకెళ్లారు. భవనాలలో విద్యుత్ సరఫరాకు ఏర్పాటుచేసిన స్విచ్ బోర్డులు, కంట్రోల్ బోర్డు ప్యానళ్లను లాక్కెళ్లారు. గోడల్లోంచి ఏర్పాటు చేసిన వైరింగ్‌ను పూర్తిగా లాగేసి వైర్‌ను తస్కరించారు. ఈ భవనాల్లో విద్యార్థులు, అధ్యాపకుల కోసం నిర్మించిన టాయిలెట్లు, బాత్ రూములలోని బేసిన్లు, కొళాయిలు, పైపులను దొంగిలించారు. అలాగే వాష్ రూములకు ఏర్పాటుచేసిన తలుపులను పీక్కెళ్లారు. తీసుకెళ్లడానికి సాధ్యంకాని విద్యుత్, తాగునీటి పరికరాలను, పైపులను ధ్వంసంచేశారు. గడచిన ఐదేళ్ల నుంచి ఈ భవనాలు నిర్వహణ లేని కారణంగా గోడలు నెర్రలిచ్చాయి. ఇలా కోట్లతో నిర్మించిన ఈ భవనాలు ప్రారంభానికి నోచుకోకమునుపే శిథిలావస్థకు చేరుకున్నాయి. వినియోగంలోకి తేవాలంటే మరలా లక్షలు వెచ్చించాల్సిన దుస్థితిలో ఈ భవనాలుండటంపై ముస్లిం వర్గాలతో పాటు ఇతరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నిర్వహణ లేక నెర్రెలు చీలిన గోడలు



స్విచ్‌లు, కేబుల్, పైప్‌లను ధ్వంసం చేసిన దుండగులు

కన్నుల పండువగా ఖాద్రీశుడి కల్యాణం



దేవేరులతో శ్రీవారు

కదిరి, మార్చి 20: బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి శ్రీదేవీ, భూదేవీ సమేత ఖాద్రీశుడి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. తొలుత యాగశాలలో కొలువుదీరిన వధువులు శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను, వరుడు శ్రీవారిని వేర్వేరుగా పల్లకిలో కల్యాణమండపానికి చేర్చారు. మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీవారి ప్రతిరూపంగా విచ్చేసిన కంకణ భట్టాచార్యుల వారు అమ్మవార్లకు మాంగళ్యధారణ గావించారు. కల్యాణోత్సవం ముగిసిన తరువాత శ్రీవారు, అమ్మవార్లపై నుంచి జాలువారిన ముత్యాల తలంబ్రాల ను దక్కించుకోవడానికి భక్తులు పోటీ పడ్డారు. సాధారణ వివాహాల్లో మాదిరిగానే ఇక్కడ కూడా కల్యాణోత్సవానికి విచ్చేసిన భక్తులు శ్రీదేవి, భూదేవిల సమేత శ్రీవారికి చదివింపులు చదివించుకున్నారు.

ప్రభుత్వం నుంచి స్వామి వారికి పట్టు వస్త్రాలు

ప్రభుత్వం, టీటీడీ నుంచి స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈసంప్రదాయాన్ని తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రారంభించింది. శ్రీవారి కల్యాణోత్సవంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

పక్షం రోజుల పాటు కొనసాగుతున్న నారసింహుడి బ్రహ్మోత్సవాల ప్రారంభానికి సూచికగా బుధవారం ఉదయం ధ్వజారోహణాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను వీక్షించడానికి ముక్కోటి దేవతలను ఆహ్వానించడం కూడా ఈధ్వజారోహణంలో భాగమే. ఇందులో భాగంగా గరుడుడి చిత్రపటాన్ని ధ్వజస్తంభంపై ఆవిష్కరిస్తారు. బ్రహ్మోత్సవాలు పూర్తయిన తరువాత అవరోహణం గావిస్తారు.



మాంగల్యం

నేడు హంసవాహనంపై శ్రీవారి దర్శనం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఖాద్రీశుడు గురువారం హంసవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. తిరువీధుల్లో స్వామి వారు ఊరేగనున్నారు.

మారని రంగు

ఆర్‌బీకేకి తొలగని వైసీపీ రంగులు

గుంతకల్లు, మార్చి 20: ప్రభుత్వ కార్యాలయాలకు వైసీపీ రంగులు ఉండరాదంటూ కోర్టు ఆదేశాలున్నా గుంతకల్లు వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2020 ఫిబ్రవరి నెలలో ఆర్బీకేల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పట్టణంలోని మార్కెట్ యార్డులోని రైతు విశ్రాంతి భవనాన్ని రైతు భరోసా కేంద్రంగా మార్చారు. దానికి వైసీపీ జెండా రంగులు వేశారు. మే నెలలో ఆర్బీకేలకు వైసీపీ జెండా రంగులు వేస్తున్నారంటూ హైకోర్టులో ప్రభుత్వ వ్యతిరేక వ్యాజ్యాలు దాఖలయ్యాయి. దీనిపై హైకోర్టు స్పందించి వైసీపీ జెండా రంగులను తొలగించి తెలుపు రంగును వేయాలంటూ ఆదేశాలను జారీచేసింది. అన్ని చోట్లా ఆర్బీకేలకు వైసీపీ రంగులను తీసేసి తెలుపు రంగులను వేసినా, గుంతకల్లు ఆర్బీకే భవనానికి మాత్రం వైసీపీ రంగులను తొలగించలేదు. హైకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కి నిర్లక్ష్యం చేశారు. పత్రికల్లో ఫొటోలు వచ్చినా ఏమాత్రం లక్ష్యపెట్టలేదు. కాగా ప్రస్తుతం ఎన్నికల కోడ్ వచ్చాక కూడా వ్యవసాయ అధికారులలో ఏమాత్రం చలనం లేకుండాపోయింది. భవనంపై ఉన్న నేం బోర్డులో ఉన్న వైఎస్ఆర్, జగన్ చిత్రాలను మాత్రం తొలగించి, పార్టీ రంగులను అలాగే ఉంచేశారు.



వైసీపీ రంగుల్లో గుంతకల్లు రైతు భరోసా కేంద్రం

గడువు పొడిగింపు

అనంతపురం సెంట్రల్, మార్చి 20: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షల ఫీజు గడువును పొడిగించినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ బుధవారం ప్రకటనలో తెలిపారు.

నిబంధనలా.. మాకా..?

- ఎన్నికల ప్రచారంలో విచ్చలవిడిగా వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు
- పలు చోట్ల తొలగింపు



వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రచారంలో పాల్గొన్న రాళ్లపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీకాంత్ (ఫైల్)



కొత్తచెరువులోని బీసీకాలనీలో వైసీపీ ప్రచారంలో పాల్గొన్న వలంటీర్



కొత్తచెరువులో ఎమ్మెల్యే ప్రచారంలో పాల్గొన్న స్టోర్ డీలర్

ఎన్నికల సంఘం నిబంధనలను కొందరు గ్రామ వలంటీర్లు, ఉపాధి హామీ సిబ్బంది, స్టోర్ డీలర్లు బేఖాతరు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ అధికారులు వారిపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఈక్రమంలో బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురిపై చర్యలు తీసుకున్నారు. అలాగే అక్రమ వ్యవహారాలకు పాల్పడి పోలీసులకు పట్టుబడిన వలంటీర్లను తొలగిస్తున్నారు. అయినా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు ఎమ్మెల్యే అభ్యర్థుల వెంట తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తుండటం గమనార్హం.

ఇద్దరు వలంటీర్ల తొలగింపు

గుమ్మఘట్ట, మార్చి 20: మండలంలోని పూలకుంట, జే వెంకటంపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు గ్రామ వలంటీర్లను విధుల నుండి తొలగించినట్లు ఎంపీడీఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ బాబు తెలిపారు. జే వెంకటంపల్లి వలంటీర్ శ్రీనివాసులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఫిర్యాదులందగా పూలకుంట వలంటీర్ హనుమంతు రెండు రోజుల కిందట కర్ణాటక నుండి అక్రమ మద్యం రవాణా చేస్తూ పట్టుబడి రిమాండ్‌లో ఉన్నారు. దీంతో ఇద్దరు వలంటీర్లను విధుల నుండి తొలగించినట్లు తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్

గుడిబండ : మండలంలోని రాళ్లపల్లిలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ నిబంధనలు అతిక్రమించి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప మండలంలోని కల్లురొప్పం గ్రామంలో రెండు రోజుల కిందట ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆ గ్రామంలోని వైసీపీ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీకాంత్ హాజరయ్యాడు. ఈ విషయంపై ఎంపీడీఓ బంగారమ్మను వివరణ కోరగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు తమ దృష్టికి వస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధ్యాయుడు, సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

కొత్తచెరువు: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొన్న ఒక ఉపాధ్యాయుడిని, సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. పుట్టపర్తి మండలం తంబాలపర్తి పాఠశాలలో ఎస్జీ టీచర్‌గా పనిచేస్తున్న ఎస్.రామాంజనేయులు, కదిరి ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శివప్రసాద్‌ను ఎన్నికల కార్యకలాపాల్లో పాల్గొని, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినందుకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

వైసీపీ ప్రచారంలో వలంటీర్, స్టోర్ డీలర్లు

కొత్తచెరువు: మండల కేంద్రంలోని బీసీకాలనీలో బుధవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నిర్వహించిన ప్రచారంలో ఓ వలంటీర్ పాల్గొనడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ప్రచారంలో 1వ సచివాలయానికి సంబంధించిన గోరంట్లపల్లి గ్రామ వలంటీర్ హర్షద్ చిందులు వేస్తూ ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. అదేవిధంగా 2వ షాపు చౌక ధరల ధాన్యపు డీలర్ మండ్లి ప్రభావతమ్మ ఎమ్మెల్యే వెంట ప్రచారంలో చురుకుగా పాల్గొన్నారు. బీసీకాలనీలో 4వ సచివాలయంలో పని చేస్తున్న వలంటీర్ సాయి ప్రకాశ్, ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్ మెన్‌గా పనిచేస్తున్న సుదర్శన్‌బాబు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వెంట చురుకుగా పాల్గొని ప్రచారం చేశారు.

కళ్యాణదుర్గంరూరల్: పట్టణంలోని గరీబ్‌నగర్‌లో ఎంపీ తలారి రంగయ్య మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారం వలంటీర్ పాల్గొన్న అంశం బుధవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నిబంధనలు బేఖాతరు చేస్తూ వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంపై సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతోంది.

పుట్టపర్తి రూరల్: ఓడీచెరువు మండలం తుమ్మల కుంటపల్లిలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించిన వలంటీర్లు, ఫీల్డ్‌అసిస్టెంటుకు ఎంపీడీఓ షోకాజ్ నోటీసులు జారీచేశారు. మంగళవారం ఎమ్మెల్యే ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు కొమ్ము ఆదినారాయణ, నరసింహులు, ఫీల్డ్ అసిస్టెంటు రామకృష్ణలకు బుధవారం రాత్రి ఎంపీడీఓ వరలక్ష్మి షోకాజ్ నోటీసులు జారీచేశారు.



కొత్తచెరువులో బీసీ కాలనీలో ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ సాయిప్రకాశ్ (వృత్తంలోని వ్యక్తి)



ప్రచారంలో పాల్గొన్న మద్యం దుకాణంలో పని చేసే సేల్స్‌మన్ సుదర్శన్‌బాబు (బ్లాక్ షర్టు వేసుకున్న వ్యక్తి)



కళ్యాణదుర్గంలో ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ రిజ్వానా (వృత్తంలోని వ్యక్తి)

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి: డీఆర్‌ఎం

గుంతకల్లు, మార్చి20: మహిళలు విద్య, ఆర్థిక స్వావలంబన సాధించాలని డీఆర్‌ఎం వినీత్ సింగ్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం దక్షిణ మధ్య రైల్వే ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూడబ్ల్యూఓ) ఆధ్వర్యంలో స్థానిక రైల్ క్లబ్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్‌ఎం మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించగల శక్తి, సామర్థ్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. విధి నిర్వహణలో మహిళలు ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తారని కితాబిచ్చారు. అనంతరం డబ్ల్యూడబ్ల్యూఓ అధ్యక్షురాలు అంజనీసింగ్ ఆధ్వర్యంలో విధినిర్వహణలో ప్రతిభ చాటిన ఉద్యోగినులకు, కళాకారులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సబార్డినేట్ అధికారులు, ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సభ్యులు, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీకి చర్యలు చేపట్టండి: కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 20: ఎన్నికల సామగ్రి పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లను త్వరగా చేపట్టాలని కలెక్టరు గౌతమి అధికారులను ఆదేశించారు. అనంతపురం అర్బన్, శింగనమల నియోజకవర్గాలకు ఎన్నికల సామగ్రిని అందించేందుకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ ఏర్పాట్లను కలెక్టరు గౌతమి బుధవారం కళాశాలకు వెళ్లి పరిశీలించారు. పంపిణీ కేంద్రం, స్ట్రాంగ్ రూంలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి పని ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఉండాలని ఆర్‌ఓలకు సూచించారు. భద్రతా పరంగా ఎలాంటి సమస్య లేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్‌శాఖను ఆదేశించారు. కార్యక్రమంలో అనంతపురంఅర్బన్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గ్రంధి వెంకటేష్, శిగనమల నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ వెన్నెలశ్రీను, తహసీల్దార్ శివరామిరెడ్డి, డీవీఈఓ వెంకటరమణనాయక్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సిద్దేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జూనియర్ కళాశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టరు గౌతమి

ఇక ఆన్‌లైన్‌లోనే ఏపీ జీఎల్ఐ కార్యకలాపాలు

అనంతపురం టౌన్, మార్చి 20: ఉమ్మడి జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన ఏపీ జీఎల్ఐ సేవలు నిధి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోనే కార్యకలాపాలు కొనసాగుతాయని జిల్లా ఉపసంచాలకులు భాస్కర్ బుధవారం ఓప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు పాలసీదారుల పాలసీలు, స్వీకరించిన ప్రీమియం వివరాలు నిధి పోర్టల్‌కు బదిలీ చేశామన్నారు. ఈనేపథ్యంలో ఏపీజీఎల్ఐ పాలసీ తీసుకున్న వారు, ఇప్పటికే అందులో లోన్ తీసుకున్న వారు, ఆ పోర్టల్‌లో పొందుపరిచిన డేటా సక్రమంగా ఉందో లేదో పరిశీలించుకొని ధ్రువీకరించుకోవాలన్నారు. ఇందుకు ఏప్రిల్ 30వతేదీ వరకు గడువు ఇచ్చినట్లు వెల్లడించారు. అతర్వాత పాలసీ వారీగా డేటా ముద్రించిన కాపీలు ఆయా శాఖల డీడీఓలకు పంపుతామన్నారు. ఏమైన అభ్యంతరాలు ఉంటే ఏప్రిల్ 30లోగా మెయిల్ ద్వారా ఏపీజీఎల్ఐ కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

చంద్రబాబుతోనే ఉద్యోగాల కల్పన

ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరా రెడ్డి



మైలసముద్రంలో ప్రచారం నిర్వహిస్తున్న పల్లె సింధూర తదితరులు

కొత్తచెరువు, మార్చి 20: నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కలగాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని పుట్టపర్తినియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరా రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మైలసముద్రం, నారేపల్లి గ్రామాల్లో బుధవారం ఆమె భర్త పల్లె వెంకటకృష్ణ కిశోర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత మైలసముద్రం గ్రామానికి రాగానే స్థానిక నాయకులు దారపనేని ఉపేంద్ర, కిలారిశ్రీనాథ్, వెంకటేశ్ తదితరులు పూలమాలలు వేసి టపాసులు కాల్చుతూ స్వాగతంపలికారు. అనంతరం సింధూరారెడ్డి ఇంటింటా తిరుగుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తర్వాత మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉన్నత చదువులు పూర్తి చేసిన యువతీయువకులు వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధిఅవకాశాలు లేక రోడ్డున పడ్డారని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ ఒక్క పరిశ్రమ రాలేదన్నారు. అదే టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ఉమ్మడి అనంతపురం జిల్లాకు కియ కార్లపరిశ్రమను తీసుకొచ్చి అనేక మందికి ఉపాధి అవకాశాలను కల్పించారని గుర్తు చేశారు. జగన్ ఉచిత పథకాల వల్లప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తే.. వారి కుటుంబమంతా బాగుపడుతుందని తెలిపారు. మరలా చంద్రబాబు సీఎం అయితే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. కనుక వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దిగువపల్లిలో సూపర్ సిక్స్‌పై ప్రచారం



దిగువపల్లిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

ఓబుళదేవర చెరువు, మార్చి 20: మండలంలోని డబురువారిపల్లి పంచాయతీ దిగువపల్లిలో బుధవారం టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జెరిపిటి అంజనప్ప తదితరులు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ రాకేష్, నాయకులు జెరిపిటి ప్రసాద్, శివా, రమణ, ఎంసి లోకనాథ్, వెంకటనారాయణ, జనసేన లక్ష్మీపతి తదితరులున్నారు.

తనకల్లు: మండలంలోని గేమేనాయక్ తండా పంచాయతీలో బుధవారం సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పథకాలపై అవగాహన కల్పించి టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే అమలవుతాయని పేర్కొన్నారు. ప్రతిఒకరు టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. సర్పంచ్ కాంతమ్మ, నాయకులు ఉత్తన్ననాయక్, శ్రీరాములనాయక్, బాలాజీ నాయక్, శ్రీనివాసులనాయక్, వెంకటరమణనాయక్, చంద్రశేఖర్‌నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలుపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి రూరల్, మార్చి 20: సార్వత్రిక ఎన్నికల నిబంధనలపై ఆర్డీఓ భాగ్యరేఖ, డీఎస్పీ వాసుదేవన్ అధ్యక్షతన రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం జరిగింది. జిల్లాకేంద్రంలో బధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్నికల నిబంధనలు, అభ్యర్థుల వాహనాల అనుమతులు తదితరాలపై అవగాహన కల్పించారు. కోడ్ అమల్లో భాగంగా రాజకీయ పార్టీల నాయకులు ప్రభుత్వ స్థలాల్లో జెండాలు పాతరాదని, ప్రభుత్వ ఉద్యోగులు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనరాదని, ప్రార్థనాస్థలాలైన మసీదుల్లో, చర్చిల్లో, దేవాలయాల్లో, ప్రచారం నిర్వహించరాదని తెలిపారు. ఎన్నికల టీంలతో సమన్వయం చేసుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. బీఎస్పీనుంచి రాయుడు, కాంగ్రెస్‌నుంచి గంగాధర్, బీజేపీనుంచి విజయ్‌భాస్కర్, సీపీఎంనుంచి గంగాధర్, జనసేన నుంచి డాక్టర్ తిరుపతేంద్రతో పాటు తహసీల్దార్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

ఓబుళదేవరచెరువు, మార్చి 20: ఎన్నికల కోడ్ ఉల్లంగిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ వరలక్ష్మి హెచ్చరించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆమె ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. ఎవరూ కూడా ర్యాలీలు, ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనరాదన్నారు. అలా పాల్గొన్నట్లు తమ దృష్టికి వచ్చినా, ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఏపీడీ శ్రీనివాసరెడ్డి, సహాయకులు శివప్రతాప్‌రెడ్డి, ఏపీఓ సుధాకర్, ఈసీ ఆంజనేయులు, సాంకేతిక సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



ఆర్థికసాయం చేస్తున్న టీడీపీ నాయకులు

నల్లమాడ, మార్చి 20: మండలంలోని ఎన్ బండవాండ్లపల్లికి చెందిన మట్టి ముతక వెంకటలక్ష్మమ్మ(65) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల నాయకులు గ్రామానికి వెళ్లి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శివశంకర్, నాయకులు బుట్టి నాగభూషణనాయుడు, సలాంఖాన్, రాజారెడ్డి, గంగరాజు, రసీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి



ఆర్. మరువపల్లిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

రొద్దం, మార్చి 20: సొంత భూమిలో మట్టిని తరలిస్తుండగా అడ్డుకున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్లను పెట్టి రాస్తారోకో చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం ముందు బుధవారం నిరసన తెలిపారు. రెవెన్యూ అధికారులు ప్రతిరోజూ మట్టిని తరలించే ట్రాక్టర్లను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. లక్షలాది రూపాయలు పెట్టి ట్రాక్టర్లను కొనుగోలుచేసి ఉపాధి కోసం పనులు చేసుకుంటే అధికారులు అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ చంద్రశేఖర్ స్పందిస్తూ సొంత భూములకు మట్టి తోలుకుంటే తమకేమి అభ్యంతరం లేదన్నారు. చెరువులో మట్టి తరలించేందుకు కచ్చితంగా అనుమతి పొందాలన్నారు. హిందూపురం పార్లమెంట్ తెలుగు మహిళ అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, రైతులు పోతన్న, మల్లయ్య, మారుతిరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

సైకో జగన్‌ను ఇంటికి పంపుదాం

● మాజీ మంత్రి పల్లె పిలుపు ● పలు గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం



పల్లెకు ఘన స్వాగతం పలుకుతున్న కొట్లపల్లి గ్రామస్థులు

పుట్టపర్తి రూరల్, మార్చి 20: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీకి అఖండ విజయాన్ని అందించి సైకోజగన్‌ను ఇంటికి పంపుదామని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. పుట్టపర్తి మండలం కొట్లపల్లి, ఇరగరాజుపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొట్లపల్లిలోకి వచ్చిన ఆయనకు గ్రామస్థులు భారీ గజమాలను వేసి పూలు జల్లుతూ ఘనస్వాగతం పలికా రు. గ్రామంలోని వాల్మీకి విగ్రహానికి పల్లె పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుంద న్నారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదన్నారు. వైసీపీ దున్నపోతులాంటిదని, తెలుగుదేశం పాలిచ్చే పాడి ఆవులాంటిదని అన్నారు. పుట్టపర్తిలో వైసీపీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేసిన అవినీతి అంతా ఇంతా కాదన్నారు. అలాంటి వారికి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈసారి ఉన్నతవిద్యావంతురాలైన సింధూరరెడ్డి పోటీ చేస్తున్నారని, ఆమెను అఖండ మెజారిటీతో గెలిపించి పుట్టపర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం ఇరగరాజుపల్లిలో ప్రచారాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ బొమ్మయ్య, నాయకులు శ్రీరామిరెడ్డి, పుల్లప్ప, శ్రీరాం నాయక్, నాగిరెడ్డి, పెద్దప్పయ్య, రామసుబ్బా రెడ్డి, రాము, చిన్న కుళ్ళాయప్ప, సతీష్, జగన్, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే ముస్లింల సంక్షేమం



పల్లెను కలిసిన నియోజవర్గ ముస్లిం మైనార్టీ నాయకులు

పుట్టపర్తి రూరల్: ముస్లిం మైనార్టీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. ముస్లిం మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మహమ్మద్ రఫీ, జామియా మస్జీద్ ముతవల్లి మహబూబ్‌బాషాల ఆధ్వర్యంలో పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువుకు చెందిన ముస్లింమైనారిటీ నాయకులు పల్లెను జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పల్లె వారితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ముస్లింలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. పవిత్రమైన హజ్‌యాత్రకు సంబంధించి హజ్‌భవన్‌కు రాజధానిలో భూమి కేటాయించిందని, అలాగే రాష్ట్రవ్యాప్తం గా షాదీ మహళ్లు, దుల్హన్‌పథకం, రంజాన్‌తోఫా, శ్మశానవాటికల ఆధునికీకరణ, కాంపౌండ్ నిర్మాణాలు, ముస్లింలకు విదేశీ విద్య వంటి పథకాలను అందజేసిందని తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ముస్లింలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ముఖ్యంగా నియోజకర్గంలో నిర్మా ణంలో ఉన్న షాదీమహళ్లను పూర్తి చేయకుండా అలాగే వదిలేసిందన్నారు. మసీదుల కోసం ఇచ్చిన నిధులను కూడా ఖర్చుచేయలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిలిచిపోయిన నిర్మాణాలన్నిం టినీ పూర్తిచేస్తామని హామీఇచ్చారు. అంతేకాకుండా ముస్లిం శ్మశాన వాటికల కోసం ఐదు ఎకరాల స్థలం కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ముస్లింమైనార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు బాబావలి, పుట్టపర్తి పట్టణ అధ్యక్షుడు యాసీన్, కొత్తచెరువు మాజీ సర్పంచు మాణిక్యం బాబా, జనసేన జిల్లా ప్రధానకార్య దర్శి అబ్దుల్, మాజీ ముతవల్లిలు ఖాదర్‌బాషా, కొత్తచెరువు మౌలాసాహెబ్, నబీరసూల్, ఆలీషా, ఖాజా హుసేన్, మిస్కిన్‌వలి, తయూబ్, ఫక్రుద్దీన్, మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 25 కుటుంబాల చేరిక



టీడీపీలోకి చేరిన వారిలో మాజీమంత్రి పల్లె

కొత్తచెరువు, మార్చి 20: మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన 25 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. జిల్లాకేంద్రంలోని పల్లె నివాసంలో బుధవారం వారు మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి సమక్షంలో , నాయకుడు కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ నాయకత్వంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై విసుగు చెంది పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున టీడీపీలోకి వలస బాట పట్టారని తెలిపారు. వచ్చే ఎన్నికలలో టీడీపీ గెలుపునకు సైనికుల్లా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామక్రిష్ణ, నాయకులు కొండప్ప, గాజుల చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోపై దాడి హేయం: తహసీల్దార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్

ధర్మవరంరూరల్, మార్చి20: పట్టణంలోని 26వ వార్డు సచివాలయ వీఆర్వో అశోక్‌ను అదే వార్డు వైసీపీ నాయకుడు సాకే నరసింహులు సచివాలయంలో దాడి చేయడం హేయమైన చర్యని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తహసీల్దార్ రమేష్, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డిలు తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వారు బాధిత వీఆర్వో అశోక్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 26వార్డులోని సర్వే నంబర్ 642లో రెండున్నర సెంటు ప్రభుత్వ స్థలం ఉందన్నారు. కాగా ఆ స్థలాన్ని అదే వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు సాకే నరసింహులు అక్రమించి కంచె వేశాడన్నారు. విషయం తెలుసుకున్న వీఆర్వో అశోక్ ఈ స్థలం ప్రభుత్వానికి సంబంధించిందని, కంచెను తొలగించాలని తెలిపారన్నారు. సాకే నరసింహులు సచివాలయంకు వచ్చి అశోక్‌పై భౌతికదాడిచేసి అక్కడి ఫర్నీచర్‌ను ధ్వంసం చేశాడని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. దాడిచేసిన నరసింహులుపై కేసు నమోదు చేయించామన్నారు. ఉద్యోగులపై దాడులు చేయడం సమంజసం కాదన్నారు. ఈ ఘటన పట్ల ఉన్నతాధికారుల కూడా దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఏవేని భూ సమస్యలుంటే డాక్యుమెంట్లతో అధికారుల దృష్టికి తేవాలన్నారు. అంతేకానీ ఇష్టానుసారంగా దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. డీటీ ఈశ్వరయ్య, ఆర్ఐ రమాదేవి, వీఆర్ఓలు, వీఆర్ఏల సంఘం నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలి: సీడీపీఓ



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ గంగరత్న

తనకల్లు, మార్చి 20: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని అర్హులైన ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఐసీడీఎస్ నల్లచెరువు ప్రాజెక్టు సీడీపీఓ గంగరత్న సూచించారు. మండలంలోని బాల సము ద్రం, టి.సదుం గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీకేంద్రాల్లో బుధ వారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ ఆధ్వర్యంలో వెయ్యిరోజుల పోషకాహార సంరక్షణపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. అంగన్‌వాడీల్లో అందించే పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత ఉండదన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు, చిన్నా రులు ఈ పౌష్టికాహారంతో పాటు స్థానికంగా లభించే ఆకుకూరలు, కాయగూరలు, చిరుధాన్యాలను ఉపయోగించు కోవాలని సూచించారు. తర్వాత వైద్య ఆరోగ్య శాఖ మహిళ సంరక్షణాధికారులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక మహిళలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన



సత్యసాయినగర్‌లో ఓ ఇంటికి అలాగే ఉన్న వైసీపీ స్టిక్కర్

ధర్మవరం, మార్చి 20: పట్టణంలో ఎన్నికల కోడ్ సరిగా అమలు కావడం లేదు. కోడ్ అమల్లోకి వచ్చి నాలుగురోజులవుతున్నా పలు ప్రాంతాల్లో ఇళ్లకు వేసిన అధికార పార్టీ స్టిక్కర్లు, పెయింటింగ్‌లు అలాగే దర్శనమిస్తున్నాయి. 31వ వార్డు సత్యసాయినగరలో ఇంటికి సీఎం జగన్, ఎమ్మెల్యేకేతిరెడ్డి ఫొటోతో ఉన్న స్టిక్కర్‌ను అలాగే ఉంచారు. గోడలకు వేసిన పెయింటింగ్‌లను చెరిపేయకుండా కేవలం కవర్‌ను అతికించి కలరింగ్ చేశారు. దీనిపై ఎన్నికల ఉన్నతాధికారులు స్పందించాలని ప్రతిపక్ష పార్టీల నాయకులు కోరుతున్నారు.

కౌంటింగ్ కేంద్రం పరిశీలన



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

హిందూపురం అర్బన్, మార్చి 20: హిందూపురం మండలంలోని బిట్ ఇంజనీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ అభిషేక్ పరిశీలించారు. ఎన్నికల తరువాత కౌంటింగ్‌కు ఇక్కడ అనుకూల పరిస్థితులపై ఆరాతీశారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను వారు ఆదేశించారు. వారి వెంట పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, మండల సర్వేయర్ శ్రీనివాసులు, ఎన్నికల డీటీ రెడ్డిశేఖర్, ఆర్ఐ అమరేంద్ర, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా కనకదాస విగ్రహ ప్రతిష్ఠ

మడకశిర రూరల్ మార్చి 20: మండలంలోని హరేసముద్రం గ్రామంలో కురుబల ఆరాధ్యదైవం కనకదాస విగ్రహ ప్రతిష్ఠ బుధవారం వైభవంగా నిర్వహించారు. హరేసముద్రం, ఉపార్లపల్లి, దొడ్డేపల్లి భక్తరహళ్ళి గ్రామాల్లోని కురుబ కులస్థులు అందరూ కలసి ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కురుబ సాధికార జిల్లా కార్యదర్శి, న్యాయవాది గోవిందప్ప, సర్పంచు కరియన్న, మాజీ ఎంపీటీసీ సభ్యులు గిరి, దొడ్డయ్య పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో అన్ని వర్గాలకు లబ్ధి

● ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి కందికుంట యశోదాదేవి



10వ వార్డులో ఇంటింటా ప్రచారం చేస్తున్న కందికుంట యశోదాదేవి

కదిరి, మార్చి 20: టీడీపీ అధినేత ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ఆ పార్టీ కదిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట యశోదాదేవి పేర్కొన్నారు. పట్టణంలోని 10వ వార్డులో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. సూపర్ సిక్స్ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. చంద్రబాబు సీఎం అయితే ప్రతిఇంటికి ఉచితంగా యేడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, 18నుంచి 59యేళ్ల మహిళలకు నెలకు రూ.15వందలు, చదువుకునే పిల్లలకు ఒక్కొక్కరికి రూ.15వేలు, రైతులకు యేడాదికి రూ.20వేలు పెట్టుబడిసాయం, నిరుద్యోగులకు నిరుద్యో భృతి ఇవ్వనున్నట్లు వివరించారు. కనుక వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సజావుగా పది పరీక్షలు : ఆర్జేడీ రాఘవరెడ్డి

ఓబుళదేవరచెరువు, మార్చి 20: పదిపరీక్షలు సజావుగా జరుగుతున్నట్లు కడప ఆర్జేడీ రాఘవరెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో శ్రీవిజ్ఞాన్, విజ్ఞాన్, జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, జీవనజ్యోతి పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ప్రతిగదికీ వెళ్లి విద్యార్థుల పరీక్ష తీరును పరిశీలించారు. అనంతరం సంబంధిత చీఫ్, సూపరిండెంట్లతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత మాట్లాడుతూ అన్ని కేంద్రాల్లోనూ పది పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని తెలిపారు. అంతకుముందు ఎంఈఓ చెన్నక్రిష్ణ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ


నల్లమాడ: మండలకేంద్రంలోని రెండు పదో తరగతి పరీక్ష కేంద్రాలను బుధవారం కడప ఆర్జేడీ రాఘవరెడ్డి తనిఖీ చేశారు. మౌలిక సదుపాయాలు సరిగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 301మందికిగాను 294పరీక్షలు రాయగా, 7మంది గైర్హాజరయ్యారు. ఆశ్రమ పాఠశాల కేంద్రంలో 155మందికి గాను 151 పరీక్షలు రాశారు. నలుగురు గైర్హాజరయ్యారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలో పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ సరస్వతి తనిఖీ నిర్వహించారు. పరీక్షల వివరాలు, మౌలిక సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా 3కేంద్రాలలో 714 మంది విద్యార్థులకు గాను 696 మంది ఇంగ్లిష్ పరీక్ష కు హాజరు కాగా.. 18 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లమాడ, మార్చి 20: మండలకేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో ప్రవేశాలకు ఈనెల 19నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎస్ఓ రమాదేవి బుధవారం ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి, ఇంటర్‌తో పాటు, 7,8వ తరగతుల్లో మిగిలిన సీట్లకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథపిల్లలు, బడిమానేసిన పిల్లలు, ఎస్సీఎస్టీ, బీసీ, మైనార్టీల పిల్లలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఆధార్‌తోపాటు తల్లిదండ్రుల ఆధార్, రేషన్‌కార్డు, కులధృవీకరణ, ఆదాయ ధృవీకరణ, స్టడీ సర్టిఫికెట్లతో పాటు పాస్‌ఫోటోలు, జనన ధృవీకరణపత్రం తదితరాలు రెండు జిరాక్స్ కాపీలు పాఠశాలలో అందించాలన్నారు. తల్లిదండ్రులు మృతిచెంది ఉంటే.. డెత్ సర్టిఫికెట్ ప్రతులను జత చేయాలని తెలిపారు.

రైలు ఢీకొని విద్యార్థి మృతి



పవన్ (ఫైల్)

కదిరిఅర్బన్, మార్చి 20: పట్టణంలోని ఆర్టీసీ డిపో వెనుక రైలు ఢీకొని విద్యార్థి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్పీకుంట మండలం వంకమద్దికి చెందిన నాగరాజు కుమారుడు పవన్ (18) ఇటీవల ఇంటర్ పరీక్షలు రాసి.. సెలవులకు తలుపుల లో ఉన్న మామగారింటికి వెళ్లాడు. బుధవారం తిరిగి స్వగ్రామానికి రావడానికి కదిరి బస్టాండ్‌కు వచ్చాడు. అక్కడ ఫోన్ మాట్లాడుతూ ఆర్టీసీ డిపో వెనుక ఉన్న రైలు పట్టాల పైకి వెళ్లాడు. అయితే అదే సమయంలో ముంబయి నుంచి నాగర్‌కోయిల్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చింది. పవన్ దానిని గమనించకుండా అలాగే ఫోన్ మాట్లాడుకుంటూ ఉండడంతో అది ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు రైల్వే పోలీసుకు సమాచారమివ్వగా, వారు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ రహీమ్ తెలిపారు.

టీడీపీ నేత గుంటుపల్లి నాగేశ్వరరావుకు నివాళి

కదిరిఅర్బన్, మార్చి 20: తెలుగుదేశం సీనియర్ నాయకుడు, జాతీయ క్రమశిక్షణ సంఘం ఉపాధ్యక్షుడు గుంటుపల్లి నాగేశ్వర రావుకు కదిరి నాయీబ్రాహ్మణ సేవా సంఘం వారు ఘన నివాళుల ర్పించారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ గుంటుపల్లి నాగేశ్వరావు మృతి టీడీపీకి తీరని లోటన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి తుది శ్వాస వదిలేవరకు పార్టీకోసం కష్టపడ్డారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రమణ, ఈశ్వరయ్య, నాగరాజు, హరిప్రసాద్, మునికుమార్, కృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

కదిరిఅర్బన్, మార్చి 20: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి గర్భవతిని చేసి వదిలేసిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఓ గ్రామానికి చెందిన భార్గవ్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి గర్భవతిని చేసి వదిలేశాడని బుధవారం బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. ఆ మేరకు అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అతడికి ఇంతకుముందే పెళ్లి అయిందన్నారు.

కెమెరాల వినియోగానికి అనుమతివ్వాలని వినతి

ధర్మవరం, మార్చి 20: ఎన్నికల విధుల్లో ప్రతి ఏడాదిలాగే ఫొటో,వీడియో కెమెరాలను ఉపయోగించేందుకు అనుమతి ఇవ్వాలని ఫొటోఅండ్‌వీడియో గ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆర్డీఓ వెంకటశివారెడ్డిని కోరారు. వారు బుధవారం పట్టణంలో ఆర్డీఓను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆర్డీఓను కలిసిన వారిలో అసోషియేషన్ సభ్యులు క్రిష్ణ, రమణ, షెక్షావలి, విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

రూ.8.2 లక్షల నగదు పట్టివేత

హిందూపురం, మార్చి 20:పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద అనంతపురానికి వెళ్లే బస్సులో పోలీసులు తనిఖీలు చేస్తుండగా రూ.8.2 లక్షలు నగదు పట్టుబడింది. బత్తలపల్లికి చెందిన శంకరయ్య అనే వ్యక్తి హిందూపురంలో అతని సొంత ఇంటిని విక్రయించి నగదును తీసుకెళుతున్నాడు. పోలీసులు తనిఖీలు చేస్తుండగా బ్యాగులో ఉన్న నగదుని స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కి తీసుకెళ్లా రు. బాధితుడు అతని ఇల్లు విక్రయించిన పత్రాలను చూపించాడు. ఈ మొత్తాన్ని ట్రెజరీలో భద్రపరుస్తామని, కలెక్టర్ వద్దకు వెళ్లి పత్రాలు చూపించి నగదుని తీసుకెళ్లవచ్చని సీఐ తెలిపారు.

నేత్రపర్వంగా లంకాదహనం

అశ్వవాహనంపై విహరించిన చంద్రమౌళీశ్వరుడు

ఉరవకొండ,మార్చి 20: పట్టణంలోని గవిమఠ స్థిత చంద్రమౌళీశ్వరస్వామి ఉత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం లంకాదహనం నేత్రపర్వంగా జరిగింది. ఉత్సవమూర్తిని గవిమఠం నుంచి ఎదురుబసవన్న గుడివరకూ ఊరేగించారు. లంకాదహన కార్యక్రమాన్ని ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, గవిమఠం సహాయకమిషనర్ చిట్టెమ్మ ప్రారంభించారు. అనంతరం ఉత్సవమూర్తిని లంకాదహనం ఎదుట ఉంచి పెద్దసంఖ్యలో బాణాసంచా కాల్చారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అలాగే అశ్వవాహనంపై చంద్రమౌళీశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తి అశ్వవాహనంపై కొలువుదీర్చి గవిమఠం నుంచి ఎదురుబసవన్న గుడి వరకూ ఊరేగించారు. కార్యక్రమంలో ఆదోని చౌకిమఠం పీఠాధిపతి కల్యాణ్‌స్వామి, సిబ్బంది నారాయణ స్వామి, మధు, వెంకటేశులు, రఘు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రం పరిశీలన



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

హిందూపురం అర్బన్, మార్చి 20: హిందూపురం మండలంలోని బిట్ ఇంజనీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ అభిషేక్ పరిశీలించారు. ఎన్నికల తరువాత కౌంటింగ్‌కు ఇక్కడ అనుకూల పరిస్థితులపై ఆరాతీశారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను వారు ఆదేశించారు. వారి వెంట పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, మండల సర్వేయర్ శ్రీనివాసులు, ఎన్నికల డీటీ రెడ్డిశేఖర్, ఆర్ఐ అమరేంద్ర, సిబ్బంది ఉన్నారు.

'అంబికా'కి ఎంపీ టిక్కెట్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

హిందూపురం, మార్చి 20: టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణకు ఎంపీ టిక్కెట్ ఇవ్వాలని నియోజకవర్గంలోని మూడు మండలాలు, పట్టణానికి చెందిన నాయకులు కోరారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసం వద్ద బుధవారం నాయకులు సమావేశమయ్యారు. టీడీపీ పట్టణాధ్యక్షడితో పాటు పార్టీ కన్వీనర్లు, ముఖ్యనేతలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ అంబికా లక్ష్మీనారాయణ పార్టీలో కీలకంగా పనిచేస్తున్నారని, రెండు సార్లు ఎమ్మెల్యే బాలకృష్ణ గెలుపు కోసం కృషి చేశారన్నారు. ఐదేళ్లుగా పార్టీ ప్రతిపక్షంలో ఉండి ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ అధికార పార్టీపై పోరాటం చేశారన్నారు. వాల్మీకి కులానికి చెందినవాడని, అందరినీ కలుపుకుపోయే వారని, ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకోవాలన్నారు. పార్టీ కన్వీనర్లు అశ్వత్థనారాయణరెడ్డి, రంగారెడ్డి, జయప్ప, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, నాగరాజు, మాజీ జడ్పీటీసీ ఆదినారాయణ, నందీష్, శ్రీరాములు, నాగలింగారెడ్డి, సర్పంచ్ మంజు, ప్రదీప్, ఆంజనేయులు పాల్గొన్నారు.

బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు ప్రదానం



నీరజను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

హిందూపురం అర్బన్, మార్చి 20: పట్టణ పరిధిలోని పాంచజన్య బ్రిలియంట్ పాఠశాల ఉపాధ్యాయిని రజనీకి బెస్ట్ పెర్ఫార్మెన్స్ నేషనల్ అవార్డు వచ్చినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు శ్రీనివాసులు తెలిపారు. సెంట్రల్ ఫర్ సొసైటీ, నేషనల్ ఇండిపెండెన్స్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆన్‌లైన్ పోటీల్లో ఆంధ్రప్రదేశకు చెందిన హిందూపురం ఉపాధ్యయరాలు నీరజ అత్యంత ప్రతిభ కనబరిచారన్నారు. బోలో ఇంగ్లీష్ పోటీల్లో ప్రథమ స్థానం దక్కించుకున్నారన్నారు. ఈ విషయంపై మంగళవారం ఢిల్లీలోని సిల్వర్ ఓక్ ఇండియన్ హ్యాబిట్ కేంద్రంలో అవార్డు అందుకున్నారన్నారు. బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, యాజమాన్యం నీరజను ఘనంగా సన్మానించారు. నీరజ మాట్లాడుతూ స్పోకెన్ ఇంగ్లీష్‌లో విద్యార్థులకు మంచి తర్ఫీదు ఇచ్చి పాఠశాలకు, తల్లితండ్రులకు, ఉపాధ్యాయులకు, దేశానికి మంచి పేరు తీసుకొచ్చే పౌరుల్లా విద్యార్థులను తీర్చిదిద్దుతానన్నారు. అనంతరం ఆమెను సన్మానించారు. కరెస్పాండెంట్ నందకుమార్, ఏఓ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఏహెచ్ఎం శశికళ, సతీష్‌కుమార్, షేక్ అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

వైభవంగా కనకదాస విగ్రహ ప్రతిష్ఠ



హరేసముద్రంలో ప్రతిష్ఠించిన కనకదాస విగ్రహం

మడకశిర రూరల్ మార్చి 20: మండలంలోని హరేసముద్రం గ్రామంలో కురుబల ఆరాధ్యదైవం కనకదాస విగ్రహ ప్రతిష్ఠ బుధవారం వైభవంగా నిర్వహించారు. హరేసముద్రం, ఉపార్లపల్లి, డొడ్డేపల్లి భక్తరహళ్ళి గ్రామాల్లోని కురుబ కులస్థులు అందరూ కలసి ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్ర త్యేక పూజలు నిర్వహించారు. కురుబ సాధికార జిల్లా కార్యదర్శి, న్యాయవాది గోవిందప్ప. సర్పంచు కరియన్న, మాజీ ఎంపీటీసీ సభ్యులు గిరి, దొడ్డయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

హిందూపురం, మార్చి 20: గ్యాస్ సిలిండర్ లీకైన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న లక్ష్మీదేవి (58) బుధవారం మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని బ్యాంకు కాలనీలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో లక్ష్మీదేవితో పాటు ఆమె మనవడు, మనువరాలికి గాయాలయ్యాయి. ప్రాథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి త రలించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మనవరాలు, మనవడు చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

పశువైద్య సహాయకులకు శిక్షణ

పెనుకొండ రూరల్, మార్చి 20: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పశువైద్య సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు బుధవారం పశు సంవర్థకశాఖ డీడీ సత్యప్రకాశ్ తెలిపారు. పెనుకొండ డివిజన్ వ్యాప్తంగా నూతనంగా 69మందిని పశువైద్య సహాయకులుగా నియమించారన్నారు. ఆర్బీకే కేంద్రాల్లో వారికి కేటాయించిన విధి విధానాలపై అవగాహన కల్పించామన్నారు. జిల్లా పశువైద్యాధికారి శుభదాస్, పెనుకొండ ఏడీ శివశంకర్‌నాయక్, కదిరి ఏడీ శ్రీనివాసరెడ్డి, పశువైద్యాదికారులు నాగేంద్ర, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ల తొలగింపు

గుడిబండ, మార్చి 20: మండలంలోని ఎస్. రాయాపురం గుడిబండలో ఉన్న పోస్టర్లను ఎంపీడీఓ బంగారమ్మ ఆధ్వర్యంలో తొలగించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ఎన్నికల కోడ్ అమలు ఏది అనే కథనం ప్రచురితం కావడంతో స్పందించిన ఎంపీడీఓ వాటిని తొలగించారు.

ఓరల్ హెల్త్ ప్రోగ్రాంపై అవగాహన

మడకశిరటౌన్, మార్చి 20: ఓరల్‌హెల్త్ ప్రోగ్రాంపై బుధవారం స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో ఎస్ఆర్ఎంఓ డాక్టర్ దివాకర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలువురు డాక్టర్లు మాట్లాడుతూ.. ఆరోగ్యానికి పళ్ల ఎంతో కీలకం అని వాటిని ఏవిధంగా శుభ్రపర్చుకోవాలి, ఎలాంటి బ్రషలు వాడాలి, బ్రష్ చేసే టెక్నికల్ విధానాలను వివరించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ వెంకటరమణనాయక్ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న సీఐ, పోలీసులు

గోరంట్ల, మార్చి 20: పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదుట హిందూపురం, కదిరి ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ సుబ్బరాయుడు ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి జిల్లా ఎస్పీ చలివేంద్రాలను ఏర్పాటు అయ్యేలా చూడాలని పోలీసులను ఆదేశించారు. స్థానిక మినరల్ వాటర్ ప్లాంటు నిర్వాహకులు ముద్దల వెంకటరాముడు, బాలాజీ సొంత ఖర్చుతో చలివేంద్ర ఏర్పాటు చేసి, మొదటి రోజు మజ్జిగను పోలీసుల చేతుల మీదుగా అందించారు.

మాయల మాంత్రికులను మించిన మంత్రులు

● టీడీపీ అభ్యర్థి సవిత



నాలుగో వార్డులో ప్రచారం చేస్తున్న సవిత

పెనుకొండ టౌన్, మార్చి 20: లేనిది ఉన్నట్లు ప్రజలను మభ్యపెట్టడంలో పెనుకొండకు ప్రాతినిత్యం వహించిన ఇరువురు మంత్రులు మాయల మాంత్రికులను మించిపోయారని పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత విమర్శించారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని నాలుగోవార్డులో ఇంటింటికీ తిరుగుతూ సూపర్ సిక్స్‌పథకాలపై వివరించారు. సవిత మాట్లాడుతూ తెలుగు దేశం ప్రభుత్వం హయాంలో గొల్లపల్లి రిజర్వాయర్‌లో నీరు అక్కడి నుంచి పెనుకొండ పట్టణానికి శాశ్వత పరిష్కారం కింద పైపులైన్ ద్వారా తాగునీటిని ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఈ ప్రాంత ప్రజలు వ లస వెళ్లకుండా కియ, దాని అనుబంధ పరిశ్రమలు తీసుకొచ్చింది టీడీపీయేనన్నారు. ఇప్పుడు అధికార పార్టీ వైసీపీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అభివృద్ధి చేసిందేమి లేదన్నారు. ఇప్పటికైనా పెనుకొండ నియోజకవర్గంలో రోడ్లు భవనాలశాఖ మంత్రిగా పనిచేసిన శంకర్‌నారాయణ, ప్రస్తుతం శిశుసంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ నియోజకవర్గంలో ఏ అభివృద్ధి చేశారో ప్రజలకు తెలుసన్నారు మంత్రి ఉషశ్రీ కళ్యాణదుర్గంలో చేసిన అరాచకాలు, అకృత్యాలు, సొంత పార్టీల నాయకులపై దాడులు పెనుకొండ నియోజకవర్గ ప్రజలకు తెలుసన్నారు. మండల మాజీ కన్వీనర్ శ్రీరాములు, రఘువీరచౌదరి, జఫ్రుల్లా, సర్పంచ్ శ్రీనివాసులు, చంద్రకాంతమ్మ, బాబుల్‌రెడ్డి, మాజీ వైస్ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, పాలడుగు చంద్ర, మైనార్టీ నాయకుడు దాదు, శ్యామ్ పాల్గొన్నారు.

టీడీపీతోనే సంక్షేమం.. అభివృద్ధి

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్



సునీల్‌కుమార్, ఈరన్నలను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

మడకశిర రూరల్, మార్చి 20: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న అన్నారు. బుధవారం మండలంలోని చందకచర్ల గ్రామంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదట గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంచాయతీ పరిధిలోని చందకచర్ల, భీమరాయణపల్లి, ఎగువ, దిగువ అచ్చంపల్లి గ్రామాల్లో విస్తృంగా పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం సునీల్‌కుమార్ మాట్లాడుతూ నవరత్నాల పేరుతో జగన్మోహన్‌రెడ్డి ప్రజలను మభ్య పెట్టారన్నారు. ఒకపక్క పథకాలు ఇస్తూ మరోపక్క వివిధ రూపల్లో ప్రజలధానాన్ని దోచుకున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం స్థానిక నాయకులు సునీల్‌కుమార్, ఈరన్నలను గజమాలతో సత్కరించారు. పాండురంగాప్ప. అశ్వత్థామప్ప, ఆదినారాయణ, రామాంజనేయులు, క్రిష్టప్ప, రాజగోపాల్, దేవలాల్‌నాయక్, బొజ్జప్ప శివాజీ పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు



పరిగి మండలవాసులకు కండువావేసి ఆహ్వానిస్తున్న సవిత



టీడీపీలోకి చేరుతున్న సోమందేపల్లి మండల వాసులు

పెనుకొండ టౌన్, మార్చి 20: రొద్దం, పరిగి, సోమందేపల్లి మండలాలకు చెందిన 25 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. వీరికి బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో తొలుత కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. రొద్దం మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ మంజునాథ్, మాజీ ఎంపీటీసీ నాగరాజు ఆధ్వర్యంలో రామాంజనేయులు, నాగభూషణ, జి.నాగభూషణ, సి.బాబు, రామలింగ, పోతన్న, పెద్దన్న, రామలింగ, నాగేంద్ర, నవీన్, గంగాధర్ చేరిన వారిలో ఉన్నారు. పరిగి మండలానికి చెందిన మైనార్టీలు మహబూబ్‌ఖాన్, మునవర్‌షా, ఇంతియాజ్, మహబూబ్, ముస్తఫా, ముక్తార్, అహ్మద్, ఇంతియాజ్‌ఖాన్, మస్తాన్, మస్తాన్‌సాబ్, సాధిక్ చేరారు. సోమందేపల్లి మండలం తుంగోడు పంచాయతీలో 50 కుటుంబాలు పార్టీలోకి చేరాయి. సవిత మాట్లాడుతూ నేను స్థానికంగా ఉంటానని మీకు ఏ సమస్య వచ్చినా నా దగ్గరకు తీసుకురావచ్చని ఆమె హామీ ఇచ్చారు.

రొద్దం: కంబాలపల్లి గ్రామానికి చెందిన 15 వైసీపీ కుటుంబాలు పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరాయి. బుధవారం రొద్దం మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన మాజీ వీఆర్ఓ రామాంజనేయులు, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు పెద్దన్న, పోతన్న, ఆధ్వర్యంలో 15 కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరిని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పార్టీ కండువావేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నాగభూషణం, రామలింగ, ఎం. నాగభూషణం, బాబు, నాగరాజు, నాగేంద్ర, నవీన్, గంగాధర్, వీరలింగ, నాగరాజు, నారాయణ టీడీపీలో చేరారు. పెనుకొండ నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు నరసింహారావు, సర్పంచ్ మంజు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి గెలుపునకు కృషి

- మాజీ జడ్పీటీసీ రామక్రిష్ణయాదవ్



మాజీ జడ్పీటీసీ రామక్రిష్ణయాదవ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న అభ్యర్థి సునీల్‌కుమార్

అగళి/మడకశిర రూరల్: తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అభ్యర్థి సునీల్‌కుమార్ గెలుపునకు శాయశక్తులా కృషిచేస్తానని టీడీపీ మాజీ జడ్పీటీసీ రామక్రిష్ణ యాదవ్ అన్నారు. బుధవారం వైసీపీ నుంచి తెలుగుదేశంలోకి సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈరన్న సమక్షంలో పూలమాలలు వేసి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో టీడీపీకి ఎనలేని కృషిచేశానని కొన్ని అనివార్య కారణాలవల్ల పార్టీని మారాల్సి వచ్చిందని అయితే టీడీపీలో అభ్యర్థిగా సునీల్‌కు కేటాయించడంతో చంద్రబాబును సీఎం చేసేందుకు పార్టీలో చేరినున్నట్లు ఆయన తెలిపారు. అలాగే చందకచర్ల వైసీపీ సర్పంచు ప్రభావతిబాయి తన అనుచరులతో వచ్చి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

లోకల్ ముద్దు.. నాన్‌లోకల్ వద్దు..!

టీడీపీ తీర్థం పుచ్చుకున్న 250 కుటుంబాలు



టీడీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి సవిత

పెనుకొండ టౌన్, మార్చి20: అధికార పార్టీ వైసీపీకి చెందిన నాయకలు, కార్యకర్తలు లోకల్ ముద్దు నాన్ లోకల్ వద్దు అనే నినాదంతో పరిగి మండలానికి చెందిన 250 కుటుంబాలు టీడీపీలోకి చేరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో పరిగి మండాలానికి చెందిన బీజీగానపల్లి, పాత్రగానిపల్లి, గొల్లపల్లి గ్రామాల నుంచి 250 కుటుంభాలులు ఎమ్మెల్యే అభ్యర్థి సవిత కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభ్యర్థి సవితకు, జనసేన, టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడంతో ఆమె చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలోకి చేరామన్నారు. ఎన్నికల్లో పరిగి మండలంలో టీడీపీకి భారీ మెజారిటీ అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీచిగానపల్లి సర్పంచ్ బాలాజీ, నీరుగంటి చంద్ర ఉన్నారు.

రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి



ఆర్.మరువపల్లిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

రొద్దం, మార్చి 20: సొంత భూమిలో మట్టిని తరలిస్తుండగా అడ్డుకున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్లను పెట్టి రాస్తారోకో చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం ముందు బుధవారం నిరసన తెలిపారు. రెవెన్యూ అధికారులు ప్రతిరోజూ మట్టిని తరలించే ట్రాక్టర్లను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. లక్షలాది రూపాయలు పెట్టి ట్రాక్టర్లను కొనుగోలుచేసి ఉపాధి కోసం పనులు చేసుకుంటే అధికారులు అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ చంద్రశేఖర్ స్పందిస్తూ సొంత భూములకు మట్టి తోలుకుంటే తమకేమి అభ్యంతరం లేదన్నారు. చెరువులో మట్టి తరలించేందుకు కచ్చితంగా అనుమతి పొందాలన్నారు. హిందూపురం పార్లమెంట్ తెలుగు మహిళ అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, రైతులు పోతన్న, మల్లయ్య, మారుతిరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

హిందూపురం, మార్చి 20: ఓటరు జాబితా పట్టుకొని ఓ టైలరింగ్ షాపు వద్ద టీడీపీ నాయకులు ఉండగా వారిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని 4వ వార్డుకు చెందిన టీడీపీ ఎస్సీ సెల్ వెంకటరమణ, ఆశోక్, బుడ్డప్ప, షేక్ సమీవుల్లా సూపర్ సిక్స్ పథకాలకు ప్రజలకు వివరించేందుకు పత్రాలతో పాటు ఓటరు జాబితా పట్టుకొని టైలర్ షాపు వద్ద ఉన్నారు. ఆ ప్రాంతంలో తనిఖీలు చేస్తున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఓటర్లకు చీరలు పంచుతున్నారంటూ టైలర్ షాపులో ఉన్న చీరలను స్వాధీనం చేసుకొని అక్కడున్న టీడీపీ నాయకులను వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్లి కేసు నమోదు చేశారు. దీనిపై వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులను వివరణ కోరగా చీరలు పంపకాలు చేస్తుండటంతోనే వారిని తీసుకొచ్చామన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు రమేష్, నాగరాజు, ఆనంద్, అమరనాథ్, మంగేష్‌లు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కి చేరుకొని జరిగిన విషయాన్ని సీఐకి చెప్పారు. ఎన్నికల ప్రత్యేక బృందాలు పట్టుకోవడంతో తాము కేసు నమోదు చేశామని చెప్పారు.

రూ.8.2 లక్షల నగదు పట్టివేత: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద అనంతపురానికి వెళ్లే బస్సులో పోలీసులు తనిఖీలు చేస్తుండగా రూ.8.2 లక్షలు నగదు పట్టుబడింది. బత్తలపల్లికి చెందిన శంకరయ్య అనే వ్యక్తి హిందూపురంలో అతని సొంత ఇంటిని విక్రయించి నగదును తీసుకెళుతున్నాడు. పోలీసులు తనిఖీలు చే స్తుండగా బ్యాగులో ఉన్న నగదుని స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కి తీసుకెళ్లా రు. బాధితుడు అతని ఇల్లు విక్రియించిన పత్రాలను చూపించాడు. ఈ మొత్తాన్ని ట్రెజరీలో భద్రపరుస్తామని, కలెక్టర్ వద్దకు వెళ్లి పత్రాలు చూపించి నగదుని తీసుకెళ్లవచ్చని సీఐ తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

పెనుకొండ, మార్చి 20: నగర పంచాయతీలోని 20వార్డుల్లో వారం రోజులుగా నీటి సరఫరాలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కరించాలని సీపీఎం నాయకులు బుధవారం కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్‌కు వినతిపత్రం అందించారు. సీపీఎం నాయకుడు రమేష్ మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలోని పెనుకొండ, కోనాపురం, మంగాపురం, వెంకటరెడ్డిపల్లి, ఇస్లాపురం, తిమ్మాపురం గ్రామాల్లో పది రోజులుగా నీటి సరఫరాలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కమిషనర్ స్పందిస్తూ తాగునీటి సరఫరాకు సంబంధించి బోర్లలో నీటిమట్టం తగ్గిపోయాయని రిజర్వాయర్‌లో కూడా తగినంత నీరు నిలువ లేదన్నారు. షీప్‌ఫాం నుంచి సరఫరా అయ్యే నీరు రోడ్డు విస్తరణలో భాగంగా పైప్‌లైన్‌లు దెబ్బతిన్నాయని కొత్తగా పైప్‌లైన్ నిర్మిస్తున్నామన్నారు. ప్రజలకు తగిన విధంగా నీరు అందించడానికి కృషిచేస్తున్నామన్నారు. బాబావలి, తిప్పన్న, ఫక్రుద్దీన్, వెంకటరాముడు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల లక్ష్య సాధనకు ఉచిత కోచింగ్ సెంటర్లు



శిక్షణ పొందిన విద్యార్థులతో ట్రస్టు సభ్యులు

పావగడ, మార్చి 20: పేద విద్యార్థుల లక్ష్యసాధనకు ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తేజస్ చారిటబుల్ ఎడ్యుకేషనల్ ట్రస్టు కార్యదర్శి, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు గాయత్రీబాయి తెలిపారు. స్థానిక తేజస్ హోటల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ద్వితీయ సంవత్సరం విజ్ఞాన విభాగంలో విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించడానికి కేఈసీటీ, నీట్ విషయాలు ఎంతో అవసరమన్నారు. ఇతర ప్రాంతాలలో ఆ శిక్షణ శిబిరాలకు రూ.లక్షల్లో ఖర్చు పెట్టాల్సి ఉంటుందన్నారు. పేద విద్యార్థుల అభ్యున్నతి కోసమే తండ్రి మాజీ ఎమ్మెల్యే సోమ్లానాయక్, భర్త శంకర్‌మూర్తి నాయక్ ప్రోత్సాహంతో ట్రస్టు స్థాపించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఉన్నత విద్యలో రాణిస్తేనే మరొకరికి మార్గదర్శకులు కాగలరని శంకరమూర్తినాయక్ అన్నారు. ఉచిత కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించి విద్యా సౌకర్యాలు అందించిన ట్రస్టుకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే సంఘం డైరెక్టర్ కె.వి.శ్రీనివాస్, కోచింగ్ మాస్టర్ వినోద్‌కుమార్, కె.సి.దాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ సమావేశం

గోరంట్ల, మార్చి 20: పట్టణంలోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్‌హాల్‌లో టీడీపీ విస్తృత్తస్థాయి సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు పార్టీ సీనియర్ నాయకులు బాలక్రిష్ణచౌదరి, సుధాకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ సుబ్రమణ్యం, నరేష్ తెలిపారు. ఉదయం పది గంటలకు జరిగే సమావేశానికి పెనుకొండ టీడీపీ అభ్యర్థి సవితమ్మ హాజరవుతారన్నారు. టీడీపీ అభ్యర్థిగా ఎంపికైన తరువాత గోరంట్ల మండలంలో మొదటి సమావేశం నిర్వహించనున్నారు. స మావేశానికి మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాలువలకు మరమ్మతులేవీ?



● దెబ్బతిన్న అడ్డుగోడలు
● రూ.7 కోట్లతో ప్రతిపాదనలు
● నేటికీ మంజూరుకాని నిధులు
● స్వర్ణముఖి నది పారితే కర్ణాటక చెరువులకు నీరు
● వృథాగా పోతున్న నీరు.. ఆందోళనలో రైతులు

మడకశిర/అగళి, మార్చి 20: మండలంలో రెండేళ్ల క్రితం కురిసిన భారీవర్షాలకు సువర్ణముఖి నది కాలువలకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. దీంతో కాలువలకు ఉన్న అడ్డుగోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తెగిన కాలువ కట్టల మరమ్మతుకు ప్రభుత్వానికి రూ.7 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే నేటికీ ఆ నిధులు మంజూరు కాలేదు. కోతకు గురైన కాలువలు, దెబ్బతిన్న అడ్డుగోడలకు మరమ్మతులు చేపడితేనే స్వర్ణముఖి నది నీరు కట్టకాలువల ద్వారా చెరువులకు చేరుతాయి.

1000 అడుగులు తవ్వినా చుక్క నీరు రాని పరిస్థితి

అగళి మండలంలో పది సంవత్సరాలుగా వర్షాభావం నెలకొంది. చెరువులు, కుంటలు నీరులేక ఎండిపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయి తాగు, సాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 1000 అడుగులు తవ్వినా నీరు దొరకడంలేదు. హెడ్‌డీ హళ్లి గ్రామ పరిధిలో 30



నదికి అడ్డంగా నిర్మించిన అడ్డుగోడ దెబ్బతిన్న దృశ్యం

బోర్లు తివ్వస్తే ఒక బోరులో మాత్రమే అరకొర నీరు పడుతున్నాయి. ఎటువంటి సాగునీటి వనరులు లేక పోవడంతో ఈప్రాంత రైతులు వర్షాధార పంటలపై ఆధారపడి జీవిస్తున్నారు. దశాబ్ద కాలం వర్షాలు కురవక పోవడం పంటలు పండక పొలాలన్నీ బీళ్లుగా మారాయి. వేసవిలో ప్రజల కష్టాలు వర్ణనాతీతం. అయితే రెండేళ్ల క్రితం భారీగా వర్షాలు కురవడంతో చెరువులు కుంటలకు నీరు చేరాయి. భూగర్భజల మట్టం పెరగడంతో బోర్లలో నీరు పుష్కలంగా ఉన్నాయి. తాగు, సాగు నీటి సమస్య ఉత్పన్నకావడం లేదని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు. ఏడాది నుంచి మళ్లీ వర్షాభావం నెలకొనడంతో చెరువులు ఎండిపోయి భూగర్భజలాలు అడుగంటాయి. ఆరు నెలల్లో అగళి మండలంలో దాదాపు 100కు పైగా బోర్లు తవ్వించిన చుక్కనీరు దొరకడం గగనం అయింది.



దెబ్బతిన్న సైడ్‌వాల్

కాలువలకు మరమ్మతులు ఎప్పుడో?

నది కాలువలకు పడిన గండ్లకు మరమ్మతు చేపట్టాలి. ఈ ఏడాది వర్షాలు కురిసి నది పారితే కాలువల ద్వారా తక్కుగా చెరువులకు నీరు చేరే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. కాలువలకు పడిన గండ్లు, కోతకు గురైన కాలవలను పూర్తిస్థాయిలో రమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరిన అడ్డుగోడలు

కర్ణాటక ప్రాంతంలోని సజ్జేహోసనహళ్లి వద్ద నదికి అడ్డంగా గోడ కట్టి నీటిని కట్ట కాలువ ద్వారా అగళి చెరువుకు తరలించేవారు. రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు కట్టిన గోడలు దెబ్బతిన్నాయి. ఆర్‌జీ పల్లి వద్ద కాలువ తెగిపోవడంతో నీరు వృథాగా తిరిగి నదిలోకే చేరింది. గతంలో



ఇరిగేపల్లి చెరువుకు వెళ్లే కాలువ కోతకు గురైన దృశ్యం (ఫైల్)

అధికారులు కాలవ తెగిపోవడంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అలాగే ఇరిగేపల్లి చెరువుకు నీటిని మళ్లించేందుకు నందరాజన గ్రామ సమీపంలో అడ్డుగోడ నిర్మించారు. భారీవర్షాలకు ఆ గోడ కూడా కోతకుగురై కొట్టుకుని పోయింది. దీంతో ఇరిగేపల్లి చెరువుకు నీరు రాకుండా పోయాయని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి కాలువలు, అడ్డుగోడలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఇరిగేపల్లి చెరువుకు నీరు రావడం లేదు



మండలంలో రెండేళ్ల క్రితం కురిసిన భారీవర్షాలకు స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహించడంతో నది కట్ట కాలువ కోతకు గురై తెగిపోయింది. ఇరిగే పల్లి చెరువుకు నీరు రావడం లేదు. వర్షాకాలంలోగా తెగిపోయిన కట్టకాలువకు మరమ్మతులు చేయించాలి. మూడు ఎకరాల భూమి ఉంది. అందులో బోరు కూడా ఉంది. చెరువులో నీరు లేకపోవడంతో బోరు ఎండిపోయింది. అధికారులు స్పందించి కట్టకాలువకు మరమ్మతు చేపట్టాలి.

- దొడ్డన్న నందరాజనల్లి, అగళి

మరమ్మతులకు రూ.7 కోట్లతో ప్రతిపాదనలు

స్వర్ణముఖి నదిపై ఉన్న అడ్డుగోడలు దెబ్బతిన్న వాటికి, కోతకు గురైన కట్టకాలువల మర్మతులు చేపట్టేందుకు ప్రభుత్వానికి రూ.7 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతు పనులు చేపడతాం.

- శ్రీనివాసులు, ఇరిగేషన్ ఏఈ